నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | KHAMMAM

ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సమ్మక్క-సారక్క సొసైటీ సభ్యులు

- సహకార సభ్యుల మధ్య భగ్గుమంటున్న ఆధిపత్య పోరు
- ఏడేళ్లుగా ఒకే కమిటీ పెత్తనం చేయడంపై విమర్శలు
- లెక్కలు చూపించడం లేదంటూ సభ్యుల ఆరోపణలు
- రెండువర్గాలుగా విడిపోయిన సమ్మక్క–సారక్క సొసైటీ.. కొత్త కమిటీ ఏర్పాటు
- కలెక్టరేట్ వద్ద నిరసనలు.. కలెక్టర్‌కు ఫిర్యాదు
- జిల్లా బాస్ ఆదేశాలతో విచారణకు దిగిన అధికారులు
- మణుగూరు మండలంలో మూడు సొసైటీల పరిస్థితీ ఇదే..

మణుగూరు మండలం చినరాయిగూడెంలో ఇసుకను తోడుతున్న సొసైటీ సభ్యులు

ఇసుక సొసైటీల్లో రచ్చ రచ్చ

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : గోదావరి ఇసుకకు బయటకు తీసే ఇసుక సొసైటీల్లోని సభ్యుల మధ్య ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఏడేళ్లుగా ఒకే కమిటీ పెత్తనం చేస్తున్నదని, ఆదాయపు లెక్కలు, బైలా చూపించడం లేదని సమ్మక్క–సారక్క ఇసుక సొసైటీలో అత్యధిక మంది సభ్యులు బహిరంగంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. 160 మందితో ఉన్న సొసైటీ నుంచి 130 మంది బయటకు వచ్చి కొత్త సొసైటీని ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు కూడా నిబంధనల ప్రకారం వ్యవహరించడం లేదని, పాత సొసైటీకే ఒత్తాసు పలుకుతున్నారని మండిపడుతున్నారు. అన్ని అర్హతలున్న తమ సంఘానికెందుకు సొసైటీని అప్పగించడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. పాత కమిటీపై విచారణ చేపట్టాలని, తాము ఎన్నుకున్న కొత్త కమిటీకి సొసైటీ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మెజారిటీ సభ్యులు కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఇదేకాక మణుగూరు మండలంలో మూడు సొసైటీల రచ్చ మరింత వివాదాలకు దారితీస్తున్నది.

ఇసుక క్వారీలో విక్రయాలు చేసే సొసైటీ అక్రమమంటూ నిరసన తెలుపుతున్న అదే గ్రామ సొసైటీ సభ్యులు(ఫైల్)

మణుగూరు మండలంలోని చినరాయిగూడెంలోని గోదావరి ఇసుక ర్యాంపును ఇసుక లేబర్ సొసైటీ పేరుతో స్థానిక స్వయం సహాయక సంఘాల్లోని గిరిజన మహిళలు నిర్వహిస్తున్నారు. ఇసుక రవాణా విషయాలు, ఖర్చులు, లెక్కలు వంటి విషయాలను సొసైటీలోని కీలకమైన పదవుల్లో ఉన్న బాధ్యులు.. సహచర సభ్యులకు చెప్పకపోవడంతో వారి మధ్య వివాదం బయటికొచ్చింది. చిలికిచిలికి గాలివానగా మారి సంబంధిత అధికారుల వద్దకు చేరింది. వారు కూడా పట్టించుకోకపోవడం, సొసైటీలోని ముఖ్యులకు ఒత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు రావడం వంటి కారణాలతో అత్యధిక మంది సభ్యులు కలెక్టరేట్ వద్ద ఇటీవల నిరసనకు దిగారు.

మూడు సొసైటీల పరిస్థితి ఇదే..

మణుగూరు మండలంలో అత్యధికంగా మూడు ర్యాంపుల ద్వారా గోదావరి నుంచి ఇసుక తోలకాలు నడుస్తున్నాయి. అవి ఈ నాటివి కావు.. దాదాపు పదేళ్ల నుంచి అక్కడ గిరిజన సొసైటీ ద్వారా ఇసుక లావాదేవీలు నడుస్తున్నాయి. ఇసుకకు డిమాండ్ ఉండడం.. బినామీ కాంట్రాక్టర్ల పెత్తనం పెరగడంతో కాంట్రాక్టర్లు సొసైటీల మధ్య చిచ్చుపెడుతున్నారు. దీంతో మూడు సొసైటీల సభ్యుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చేశారు. చినరాయిగూడెం, కొండాపురం, పద్మగూడెం, కొమ్ముగూడెం ర్యాంపుల పరిధిలో సొసైటీల సభ్యులు రోజుకొకరు బయటకు వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టి ఆందోళనలు చేస్తున్నారు. సమ్మక్క–సారక్క, నాగులమ్మ, పెద్దమ్మతల్లి సొసైటీల మధ్య వివాదం ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చిలికిచిలికి గాలివానలా తయారవుతున్నది.

ఏడేళ్లుగా ఒకే కమిటీ పెత్తనం..

చినరాయిగూడెం ఇసుక ర్యాంపును 2017లో అప్పటి అధికారులు 'సమ్మక్క–సారక్క ఇసుక లేబర్ సొసైటీ'కి అప్పగించారు. అప్పటి సభ్యులు వెంకటరమణను సొసైటీ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కీలకమైన పదవుల్లో కొందరిని, సభ్యులుగా మరికొందరిని ఎన్నుకున్నారు. అందరూ కలిసి ఈ ర్యాంపు ద్వారా ఇసుకను విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. లెక్కలు ఎందుకు చెప్పడం లేదని, బైలా ఎందుకు చూపించడం లేదని సొసైటీ ముఖ్య బాధ్యులను ఇతర సభ్యులు నిలదీశారు. వారు స్పందించకపోవడంతో సంఘంలోని అధిక సంఖ్యలో ఉన్న సభ్యులు అదే పేరుతో(సమ్మక్క–సారక్క ఇసుక లేబర్ సొసైటీ) కొత్త కమిటీని ఎన్నుకున్నారు. తమ కమిటీలో అత్యధిక మంది సభ్యులున్నందున సొసైటీ బాధ్యతను, ఇసుక ర్యాంపు తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. పాత కమిటీలోని ముఖ్యులు.. సొసైటీ నిబంధనలు పాటించడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారణకు కలెక్టర్ ఆదేశించారు..

సమ్మక్క–సారక్క ఇసుక సొసైటీ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం. సభ్యుల్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు.

– ఖుర్షీద్, డీసీవో, భద్రాద్రి కొత్తగూడెం

లెక్కలు చెప్పడం లేదు..

పాత సొసైటీపై విచారణ చేయాలని కోరుతూ ఏడాదికాలంగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాత కమిటీ బాధ్యులు ఆదాయ వివరాలు చెప్పడం లేదు. తప్పుడు లెక్కలతో ఇసుక ర్యాంపు నడిపిస్తున్నారు. బైలా కూడా చూపించడం లేదు.

– తెల్లం నాగమణి, సొసైటీ కార్యదర్శి, చినరాయిగూడెం

రెండేళ్లకు కమిటీ మారాలి..

సొసైటీ నిబంధనల ప్రకారం రెండేళ్ల కోసారి కొత్త కమిటీని ఎన్నుకోవాలి. మహాజన సభ తీర్మానం ద్వారా కమిటీని ఎన్నుకునే అవకాశం సభ్యులకు ఉంది. అలాగే మేమూ కొత్త కమిటీని ఎన్నుకున్నాం. కానీ.. అధికారులు మాకు ర్యాంపు నిర్వహణ బాధ్యతను అప్పగించలేదు.

– సోంది నర్సమ్మ, సొసైటీ ఉపాధ్యక్షురాలు, చినరాయిగూడెం

మా కమిటీలో 130 మంది సభ్యులున్నారు..

కొత్తగా ఎన్నుకున్న మా సొసైటీలో 130 మంది సభ్యులం ఉన్నాం. పాత సొసైటీలో 30 మందే ఉన్నారు. నిబంధనల ప్రకారమే కొత్త కమిటీ ఎన్నుకున్నాం. పాత కమిటీ వ్యవహారాలపై విచారణ చేయాలని కోరితే అధికారులెవరూ స్పందించడం లేదు.

– కుంజా ఆదిలక్ష్మి, సొసైటీ సభ్యురాలు, చినరాయిగూడెం

పట్టాభిరాముడు

- వైభవోపేతంగా శ్రీ సీతారామచంద్రస్వామి మహాపట్టాభిషేకం
- కనులారా తిలకించి పరవశించిన భక్తజనం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


భద్రాచలంలో పట్టాభిషిక్తుడైన శ్రీ సీతారామచంద్రస్వామి

ఖమ్మం, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : : సకల గుణాభిరాముడు, సమాజానికి ఆదర్శప్రాయుడైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మహా పట్టాభిషేకం వేడుకను సోమవారం మిథిలా స్టేడియంలో అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తమ ఆరాధ్య దైవం శ్రీరాముని పట్టాభిషేక తంతును భక్తులు కనులారా వీక్షించి తన్మయం పొందారు. రాజ లాంఛనాలతో నిర్వహించిన ఈ వేడుకను తిలకించి భక్తజనం పరవశించింది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో సీతారామచంద్రస్వామి కల్యాణం మరుసటిరోజు మహా పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రెండు వేడుకలు అత్యంత విజయవంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. మహా పట్టాభిషేకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని శ్రీరాముడు, సీతమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేసిన గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, ఈవో రమాదేవి, వేదపండితులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలు, మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు గవర్నర్‌కు ఆశీర్వచనం ఇచ్చి వస్త్రాలు, జ్ఞాపిక, ప్రసాదాన్ని అందజేశారు. నూతన దంపతులైన శ్రీసీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేక వేడుక నిర్వహించే మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభిత కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనాన్ని మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసి శ్రీరాముడికి శాస్త్రోక్తంగా పట్టాభిషేక తంతును నిర్వహించడంతో భక్తజనం పులకించింది. సరిగ్గా పది గంటల నుంచి పట్టాభిషేక తంతు సాగగా ఆరాధన అనంతరం వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి శ్రీరామ మహా పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించిన తీరు ఆకట్టుకుంది. వేదాశీర్వచనం, అష్టోత్తర శతహారతి 108 వత్తులతో వెలిగించి భద్రాచలం శ్రీరామచంద్రప్రభువుకు సమర్పించడంతో మహా పట్టాభిషేకం సుసంపన్నమైంది. మహాపట్టాభిషేక కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఈవో రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 7 : ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీను తన భూమి, బావి సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కెనాల్ కింద పోయాయని, బావికి సంబంధించిన పరిహార సొమ్ము జమకాలేదని, వాటిని ఇప్పించాలని కోరారు. చింతకాని మండలం కొదుమూరుకు చెందిన తాళ్లూరి వెంగళరావు తమ భూములకు అవసరమైన సర్వీస్ రోడ్డును నిర్మించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రజావాణి ద్వారా వివిధ శాఖలకు 300లకు పైగా దరఖాస్తులు పంపిస్తే 151 అర్జీలకు మాత్రమే స్పందన వచ్చిందని సీపీవో, డీఆర్‌డీవో, మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీరాజ్‌శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ పాల్గొన్నారు.

స్కూల్‌లో లేరు.. స్పాట్‌లో రిపోర్ట్ చేయలేదు..

- టెన్త్ వాల్యుయేషన్ వద్ద కానరాని ఉపాధ్యాయులు
- క్యాన్సిలేషన్ కోసమే అధికంగా దరఖాస్తులు
- మధ్యాహ్నం వరకు ప్రారంభంకాని మూల్యాంకనం
- రిపోర్టు చేయని టీచర్లపై చర్యలు : డీఈవో

స్పాట్ సెంటర్‌లో రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 7 : పదో తరగతి వార్షిక పరీక్షల సమాధాన పత్రాలు వాల్యుయేషన్ చేసేందుకు ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయుల్లో కొందరు స్కూల్‌లో రిలీవ్ అయ్యారు కానీ స్పాట్‌లో రిపోర్టు చేయలేదు. ఉదయం 9గంటలకే స్పాట్‌కి ఉపాధ్యాయులు చేరుకున్నప్పటికీ క్యాన్సిలేషన్ కోసమే చాలామంది ఆసక్తి చూపించారు. వివరాల్లోకెళ్తే.. సోమవారం ఖమ్మం నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల కేంద్రంగా టెన్త్ స్పాట్ ప్రారంభమైంది. మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉపాధ్యాయులు రిపోర్టు చేస్తూనే ఉన్నారు. రిపోర్టింగ్ ప్రక్రియను ఎంఈవోలు శైలజాలక్ష్మి, శ్రీనివాస్, వీరాస్వామి నిర్వహించారు. రిపోర్టింగ్ తక్కువ ఉందని క్యాంప్ ఆఫీసర్ ఏటూరి సోమశేఖరశర్మకు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ వివరించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. దీంతో మధ్యాహ్నం 2గంటల తర్వాత స్పాట్ ప్రారంభమైంది.

గురుకులాలకు రిక్వెస్ట్...

పదో తరగతి సమాధాన పత్రాలు వాల్యుయేషన్ చేయడంలో అసిస్టెంట్ ఎగ్జామినర్స్, వారికి సహాయంగా ఉండాల్సిన స్పెషల్ అసిస్టెంట్ల కొరత వేధిస్తున్నది. సబ్జెక్ట్ టీచర్లు సైతం ఇంకా అవసరం ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇదంతా ఒకవైపు జరుగుతుంటే ఉపాధ్యాయ సంఘ నాయకులు మాత్రం స్పాట్ విధుల నుంచి క్యాన్సిల్ చేయించే పనిలో నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో ఏఈలు లేకపోవడంతో బీసీ, సోషల్ వెల్ఫేర్ గురుకులాల అధికారులతో మాట్లాడి వాల్యుయేషన్‌కు టీచర్లను నియమించాలని డీఈవో, క్యాంప్ ఆఫీసర్ సోమశేఖరశర్మ కోరారు. దీంతో వారు మంగళవారం రిపోర్ట్ చేసే అవకాశం ఉంది. సోమవారం మధ్యాహ్నానికి చీఫ్ ఎగ్జామినర్లుగా 109మందికి 84 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 648మందికి 496 మంది, స్పెషల్ అసిస్టెంట్లుగా 218మందికి 115 మంది పాల్గొననున్నారు. మూల్యాంకనం ప్రక్రియలో సహాయ ఎగ్జామినర్స్ ఎంత కీలకపాత్ర వహిస్తారో స్పెషల్ అసిస్టెంట్లు అదే స్థాయిలో కీలకపాత్ర వహిస్తారు. 250మందికి పైగా స్పెషల్ అసిస్టెంట్లకు విధులు కేటాయించగా 100మందికి పైగా గైర్హాజరైనట్లు తెలుస్తోంది. మూల్యాంకనం చేసేందుకు ఏఈలకు పేపర్లు ఇచ్చేందుకు ఎస్‌జీటీలను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించారు. వీరి గైర్హాజరుతో అవసరమైన మేర బీఈడీ కళాశాలల విద్యార్థులతో మంగళవారం నుంచి స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

క్యాన్సిలేషన్‌కు అనారోగ్యం సాకు..!

ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా కొందరు ఉపాధ్యాయులు తమ ఉత్తర్వుల క్యాన్సిలేషన్ కోసం పైరవీలు చేశారు. క్యాన్సిలేషన్‌కు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు 200 మంది ఉండగా అందులో అత్యధిక మంది ఆరోగ్యం బాగోలేదంటూ మెడికల్ సర్టిఫికెట్ పొందుపరిచారు.

2,34,727 సమాధాన పత్రాలు రాక...

జిల్లాకు 2,34,727 సమాధాన పత్రాలు స్పాట్‌కు చేరుకున్నాయి. రెగ్యులర్ వాటితో పాటు ఒకేషనల్ 1,340 పేపర్లు వచ్చాయి. ఏఈలు 152మంది, స్పెషల్ అసిస్టెంట్స్ 103మంది రిపోర్ట్ చేయలేదు. స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. హాజరుకాని వారిపై చర్యలు తీసుకోనున్నట్లు క్యాంప్ ఆఫీసర్ సోమశేఖరశర్మ తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియను పరిశీలించేందుకు అబ్జర్వర్‌గా మోడల్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీనివాసచారిని నియమించారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

- ధాన్యం, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు పాట్లు
- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా నేలరాలిన మామిడి కాయలు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు

సత్తుపల్లిలో వర్షం

సత్తుపల్లి టౌన్/అశ్వారావుపేట/దమ్మపేట/వేంసూరు/పెనుబల్లి/ఇల్లెందు, ఏప్రిల్ 7 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పొద్దంతా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. అయితే రైతులు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కొన్నిచోట్ల తడవగా.. మరికొన్నిచోట్ల టార్పాలిన్లు, బరకాలు కప్పి పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. సత్తుపల్లి మండలంలో ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షంతో పక్వానికి వచ్చిన మామిడి కాయలు చాలాచోట్ల రాలిపడ్డాయి. అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం తడిసిపోయినట్లు తెలిసింది. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అశ్వారావుపేట మండలంలో అకాల వర్షం కురిసింది. ఆసుపాక, వినాయకపురం, మామిళ్ళవారిగూడెం తదితర గ్రామాల్లో వడగండ్లతో కూడిన వర్షం పడింది. ఆరబెట్టిన వేరుశనగ, పొగాకు బేళ్లు తడవకుండా రైతులు బరకాలు కప్పుకున్నారు. తడిసిన పొగాకు నాణ్యత కోల్పోవడంతో గిట్టుబాటు ధర పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రామన్నగూడెం సమీపంలోని రోడ్డుపై చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది. దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. పలుచోట్ల పక్వానికి వచ్చిన మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులకు కొంతమేర నష్టం వాటిల్లింది. వేంసూరు మండలంలో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, వరి ధాన్యపు రాశులపై పట్టాలు కప్పుకున్నారు. పెనుబల్లి మండలంలో మొక్కజొన్న, ధాన్యపు రాశులపై రైతులు పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. మామిడి రైతులకు కొంతమేర నష్టం వాటిల్లింది. రాలిపోయిన మామిడి, తడిచిన ధాన్యం రైతులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


దమ్మపేట : రాలిన మామిడి కాయలు

దమ్మపేట : మొక్కజొన్న రాశులపై పట్టాలు కప్పి ఉంచిన రైతులు

అశ్వారావుపేట : రామన్నగూడెం సమీపంలో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

వర్షంలో పాగాకు బేళ్లు తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతు కూలీలు